# అభ్యుదయం

## పుప్పాల లక్ష్మణరావు

నేను నవలా రచయిత్రిని. ఎంచేతో మరి యీవాళ ఒక థానిక రాయాలనిపించిందినాకు

నాకు నాయనమ్మనీ అవాలనుంది. సినిమా రచయిత్రినీ అవాలని వుంది... అందుకని "అనగా అనగా వో తల్లి!" అని మొదలెడుతా. ఆ తల్లిని నేనే. మా అమ్మ నన్ను కని పురిట్లోనే కన్నుమూసింది. మా నాన్న నన్ను ముద్దుగా పెంచాడు. చదువు చెప్పించాడు విశాఖలో మెడిసన్ పూర్తిచేసి, హౌస్‌సర్జన్‌గావుండేదాన్ని. రాఘవులు యూనివర్శిటీలో ఫిజిక్స్ లెక్చరరు. రాఘవులు గేయకవి. మరి అదేం ఖర్మమో కాని, 'తార' అని కలం పేరుతో రాసిన యితని కవితలు అచ్చువేసుకున్న ప్రతి వారపత్రికా మఘలో పుట్టి పుబ్బలో పోయినదే!

నేను చివరి యేడాది చదువుతున్న రోజుల్లో మా కిద్దరకీ స్నేహం కుదిరింది. ఇద్దరం కలుసుకుని సినిమాల కెళ్ళేవారం. ఇహ సముద్రపొడ్డుకి సరేసరి!

కక్కువొచ్చినా కళ్యాణం వొచ్చినా ఆగలేం అంటారు పెద్దలు. నాకు కళ్యాణంకంటే కక్కులే ముందొచ్చాయి. రాఘవులు నన్ను మోసం చేశాడంటారుఅందరూ— మా హౌస్‌సర్జన్లు అతన్ని చంపేస్తావని దాడికి బయల్దేరారు కూడాను. రాఘవులు నన్ను మోహించాడో తెలీదు. నేనే అతన్ని మోసం చేశానేమో- చెప్పలేను. రాఘవులు నా కంటే ఏణ్ణర్థం చిన్న. అతని బీజం నా కడుపులో పడకముందే నా గుండెలో అభ్యుదయ భావ బీజాలుండటం చేత నా పాతివ్రత్యాన్ని రుజువు చేసుకొందుకు రాముడి సీతలా నేను అగ్నిప్రవేశమూ చెయ్యలేదు, వనవాసానికీ వెళ్ళలేదు. చివరకి నూతిలో నైనా పడలేదు.

కడుపు దింపించుకోలేదని మా హైస్కూలు మిత్రులందరూ నన్నుచూసి మహా అసహ్యించుకున్నారు. "అభ్యుదయ భావాల్లేని అభాగ్యురాలు." అని నన్ను తిట్టిపోశారు.

మా నాన్న పరువు మర్యాదలున్న మనిషి. అందుకని నాతో అన్నాడు. కడుపు తీయించుకుంటే- తనకున్న సర్వస్వం యేభై వేలూ సంతోషంగా ఇచ్చేస్తానన్నాడు, "లేదూ" ఆ మొగాడిచేత నామెళ్లో పుస్తె కట్టించేటట్టు చేస్తినా, ఆ యేభై వేలూ "ఆ దౌర్భాగ్యుడికి దానం చేస్తా"నన్నాడు. యేదైనా, నెల రోజుల్లో, నాకు నాలుగోనెల వొచ్చేలోపునే అటోయిటో తేల్చేస్తే తను పరువు మర్యాదల్తో 'హరీ' మంటానన్నాడు.

తిక్కన భారతంలో చెప్పినట్లు, "బంగయి పాలలో బడిన బల్లి విధంబున" కొట్టుకుపోయాను.

రాఘవులు తండ్రియేం తక్కువ తిన్నాడా! తులాభారం మనిషి. అన్నిటినీ డబ్బుతో తూస్తాడు. నాకు కబురుపెట్టి, "నా కడుపులో వున్న బిడ్డకి రాఘవులు తండ్రికాడు. నేను రాఘవుల్ని పెళ్ళిచేసుకోను" అని ముక్కరాసి తనకిస్తే నా మొహాన నలభై వేలు పారేస్తానన్నాడు. నెలరోజులు వ్యవధిచ్చాను, పొమ్మన్నాడు. కొడుకు మనసు మళ్లించడానికి, ముప్పైవేల కట్నంతోనూ, మూడు పుట్ల మాగాణి పాతికెకరాలతోనూ వొస్తున్న గొప్ప సంబంధాన్ని హుటాహుటిని కుదుర్చుకొచ్చి, కొడుకుతో, "నేను తెచ్చిన పిల్లని చేసుకుంటావా సరేసరి. లేదూ, ఆ ఆస్పత్రి మనిషినే చేసుకుంటానూ అంటే నీకు కాణీ యివ్వకుండా అంతా నా ముండపేర రాసేస్తాను. నా ఆస్తిఅంతా నా స్వార్జితం. నాయిష్టం!" అని బెదిరించాడు.

శ్లేష్మంలోపడ్డ యీగలాకొట్టుకుపోయాడు రాఘవులు. రాఘవులు కూడా అభ్యుదయ భావాలున్న యువకుడే. రాఘవులు తండ్రి కోరినట్టూ ముక్కరాసిచ్చేసి ఆ నలభై వేలూ తీసుకున్నాడు. రాఘవుల్ని మా నాన్న దగ్గరికి తీసుకెళ్ళి, యేడుకొండలవాడి గిల్టు బంగారు బొమ్మ తలకాయిమీద చెయ్యేసి, నన్ను చేసుకుంటానని ప్రమాణం చేయించి, ఆ యేభై వేల రూపాయలూ అతనికి ముట్టచెప్పించేసరికి నా తలప్రాణం తోక్కొచ్చింది.

ఈ డబ్బు వొసూల్జేసుకుని ఆ రాత్రికి రాత్రే టాక్సీ చేసుకుని సింహాచలం వెళ్ళి అప్పన్న కొండ సమక్షాన రాఘవులచేత నా మెళ్ళో మూడుముళ్ళూ వేయించుకుని, తెల్లారేసరికి విశాఖలో నూతన వధూవరులమై వెలశాం. మా పెళ్లికబురు వియ్యంకులిద్దరి చెవినిబడేసరికి యిద్దరూ గుండె ఆగిపోయి తారున చచ్చూరుకున్నారు.

మా నాన్న వాగ్దానం నిలబెట్టుకొని సంతోషంగానే చచ్చిపోయాడు, గుండెజబ్బున్న వాళ్ళకి హఠాన్మరణం తప్పదుగా మరి.

రాఘవులు తండ్రికి ఎన్ని జబ్బులుండాలో అన్నీ వున్నాయి. వీటికి తోడు సిర్రోసిస్ ఆఫ్ ది లివర్. తనడబ్బు ముండకి దక్కలేదని విచారంతో సెరిబ్రల్ హెమరేజొచ్చి లోకయాత్ర చాలించాడు.

ఆ నాటి మోహంలోంచి యిద్దరం యింకా బయటపళ్లేదు. రాజకీయాల వైకుంఠపాళిలో గండాలన్నీ తప్పించుకుని వాత్తేరు పుట్టలో వున్న విషనాగుల కాట్లనుంచి "నాయుడుల వర సయ్యగారి" దయవల్ల బతికి బయట ప్రొఫెసరయ్యాడు. ఎక్స్టర్నల్ ఎగ్జామినర్లకి ఘనమైన పార్టీలిచ్చి ఐదారు ఉత్తరాది యూనివర్సిటీల్లో ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ షిప్పులూ, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో మెంబర్ షిప్పులూ సంపాదించాడు. నెలకి పదిహేనువందలు జీతం. చేతి కింద మేరికల్లాంటి రీడర్లిద్దరూ, అరడజను లెక్చరర్లూ, కడుపులో చల్ల కదలకుండా హాయిగా వెళ్ళిపోతూంది అతని జీవితం.

నా ప్రాక్టీసూ బాగుంది. నెలకి క్లినిక్కూ వగైరా ఖర్చులు పోను, రెండు మూడు వేలు సులువుగా కిడతాయి. ఇన్‌కమ్-టాక్స్ యెగ్గొడతాను గనుక అంతా నికరాదాయమే.

నేను మొహానికి పసుపు రాసుకుంటననీ, పావలా కాసంత కుంకుంబొట్టు పెట్టుకుంటాననీ, కాలివేళ్ళకి మట్టెలు పెట్టుకుంటాననీ పేరంటానికెళ్లి పాదాలకి పసుపు రాయించుకుంటాననీ, గోళ్ళకీ అరచేతులకీ గోరింటాకు పెట్టించుకుంటాననీ, ప్రాక్టీసు పెంచుకుందుకు యివన్నీ- చౌకబారు బజారు టక్కులని తోటి డాక్టర్ల యేడుపు. అభ్యుదయమూ యువతా తాండవించే చోట రాజ్యంచేసేది- గుండే- మొహం కాదన్న సంగతి వాళ్ళకి స్ఫురిస్తే కద!

మాకు కొడుకూ కూతురూనూ. మూర్తి బయో కెమిస్ట్రీలో పి. హెచ్. డి, చేస్తున్నాడు. వాడు అభ్యుదయ గేయ కవి. చిన్న పిల్లడు — వాడికింకా మంచి చెడ్డలు తెలీవని మంచి సంబంధం చూసి పెళ్ళిచేశాం. సాంప్రదాయ కుటుంబం. లక్షణమైన పిల్ల. ఐ. పి. యస్. ఆఫీసరు కూతురు. కాశీ అన్నపూర్ణ పేరు. అన్నపూర్ణ ఎమ్.కామ్. చదువుతూంది. పెళ్లి అయేముందు వీళ్లు ఇద్దరూ ముక్కూ మొహం యెరక్కపోయినా పెళ్ళయిన ఉత్తరక్షణం నుంచి వొకళ్ళొకరు అంటి పెట్టుకుని అతి అన్యోన్యంగా వుంటున్నారు. మా కూతురికి అలివేలు అనిపేరు పెట్టాం. దానికి మొన్ననే ఇరవయ్యోయేడొచ్చింది. ఎమ్. బి. ఏ చదువుతూంది. అందరూ ఏక కుటుంబముగానే వుంటున్నాం. అందరివీ అభ్యుదయ భావాలే. మాకు మాకుటుంబం తప్ప మాకు మరోలోకంలేదు. అదే మా మా స్వర్గం, మా కొడుకూ, కోడలూ, కూతురూ, మనవలూ వాళ్ళ సౌఖ్యమే మా సౌభాగ్యం. వాళ్ళ కోసమే మా బతుకు. మా స్వర్గధామ వాసులంతా ఎనమండుగురం యువకులమే. మా ఆరాధ్యదైవం అభ్యుదయం!